క్లుప్తంగా

చలో హైదరాబాద్ జయప్రదం చేద్దాం



అలంపూర్: మున్సిపల్ కార్మికుల చలో హైదరాబాద్‌ను జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, మునిస్వామి, ఏసేపు, అంజి, రాము, రాఘవేంద్ర ఉన్నారు.

పంటపొలాల్లో ధ్యానం



అయిజ: గాంధీ జయంతిని పురస్కరించుకొని శ్రీ శివాంజనేయ పిరమిడ్ ధ్యాన శక్తి మహా క్షేత్రం సభ్యులు శాఖాహారం వల్ల ఉపయోగాల గురించి తెలిపేందుకు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అయిజ శివారులోని పంటపొలాల్లో ప్రజలతో ధ్యానం చేయించారు. కార్యక్రమంలో రమేష్, ప్రభాకర్, తిరుమలేష్, కృష్ణ పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి



ధరూరు: పల్లె దవాఖానల్లో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వీరన్నగౌడ్ అన్నారు. సోమవారం అల్వలపాడులోని పల్లె దవాఖానలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు పల్లె దవాఖానలో అందించే సేవలు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పల్లె దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా డ్వాక్రా భవనం



మల్దకల్: మండలంలోని ఎల్కూరులో డ్వాక్రా భవనం నిరుపయోగంగా ఉంది. 14ఏళ్ల క్రితం రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనం చెరువు సమీపంలో ఉండటంతో మహిళలు వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. డ్వాక్రా భవనం చుట్టు కంపచెట్లతో విష పురుగుల ఆవాసంగా తయారైంది. లక్షలు వెచ్చించి నిర్మించిన డ్వాక్రా భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి డ్వాక్రా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం గ్రామానికి చెందిన తిమ్మన్న, వల్లూరుకు చెందిన భీమేష్‌లు మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లు ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తిమ్మన్న కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతకు పాటుపడాలి

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారబోయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలో స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత హై సేవా, వేస్ట్ టూ వండర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పురసిబ్బంది ఉన్నారు.

అమరచింత: మనతో పాటు మన ఇంటి చుట్టు ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరం ఆరోగ్యంగా ఉంటామని బీడీ కార్మికుల దవాఖానా వైద్యులు డాక్టర్ రమేష్ గౌడ్, డాక్టర్ స్వాతి అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈమేరకు స్వచ్ఛతపై మహిళలకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చేత్త సేకరణ వాహనంలో వేయాలని సూచించారు.

జాతిపితకు ఘన నివాళి



గట్టులో గాంధీజీకి నివాళులర్పిస్తున్న నాయకులు



అలంపూర్‌లో మహాత్ముడికి ఎమ్మెల్యే అబ్రహం నివాళి

- గాంధీజీ విగ్రహాలకు పూల మాలలు వేసిన జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యేలు
- గ్రామాల్లో గాంధీ చిత్రపటాలకు నాయకుల నివాళి

గద్వాల: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, పలు సంఘాల నాయకులు వేరువేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్



ఎర్రవల్లి చౌరస్తాలో గాంధీజీకి నాయకుల నివాళి

సరిత తన క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతలపేట కాలనీలో గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు. గాంధీ చౌరస్తాలో గాంధీజీ విగ్రహానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, రామంజనేయులు, బండల వెంకట్రాములు పాల్గొన్నారు. గద్వాల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, ఆవోపా నేతలు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, ఎంఐఎం పార్టీల ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు.

మహాత్ముడి కలలను సాకారం చేద్దాం

అలంపూర్: మహాత్మాగాంధీజీ కలలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరు కలిసి రావాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. గాంధీ మార్గంలో అందరం పయనిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. గాంధీ చౌక్‌లోని మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అలంపూర్ మున్సిపాలిటీలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో గాంధీ జయంతిని ఆర్య వైశ్య సంఘం నాయకులు నిర్వహించారు. పట్టణంలో శాంతి ర్యాలీ చేపట్టారు.

గద్వాల అర్బన్: వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇంచార్జ్ అతిఖుర్ రహ్మాన్ గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్ళులర్పించారు.ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాష, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు బంగి సుదర్శన్‌లు గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రీ విగ్రహానికి పూలమా వేసి నివాళ్ళులర్పించారు.

గద్వాల క్రైం: మహాత్మాగాంధీ, రెండో ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రీ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రవి మాట్లాడారు. జిల్లా వైద్యాశాఖ, ప్రభుత్వాస్పత్రి, ఎక్సైజ్, రవాణాశాఖ, ఆర్‌టీసీ, అగ్నిమాపక కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు.

ధరూరు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి ఎంపీపీ నజీమున్నీసా బేగం, ఎంపీఓ కృష్ణమోహన్ పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.

రాజోళి: మండల కేంద్రం గాంధీ చౌక్ వద్ద గాంధీ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు గాంధీ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ చౌక్‌లో విగ్రహానికి నివాళులర్పించారు.

మల్దకల్: ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు విజయ్‌కుమార్, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నల్లారెడ్డి, వెంకటేష్‌లు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.



మానవపాడులో..

మానవపాడు: మహాత్మాగాంధీ చూపిన పోరాట మార్గం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని ఎస్ఐ రాము తెలిపారు. పోలీస్ కార్యాలయంలో గాంధీ చిత్రటానికి పూలమాల వేసి నివాళుర్పించారు.

గట్టు: గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ పార్టీ పర్యవేక్షకులు సద్దుగౌడ, కావేరిలు తెలిపారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బల్గెరలో గాంధీ చిత్ర పటానికి జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బల్గెర హనుమంతులు నివాళ్లు అర్పించారు. పీఏసీఎస్‌లో, రైతు వేదిక, మాచర్లలో నివాళులర్పించారు.

కేటీదొడ్డి: తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ సరితారాణి, డీటీ శివశంకర్, ఆర్ఐ ఉదయ్ కుమార్‌లు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు.



గాంధీజీకి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాళి



మాచర్లలో..



మల్దకల్‌లో గాంధీకి కాంగ్రెస్ నాయకుల నివాళి

గాంధీ విగ్రహానికి ఆశా వర్కర్ల వినతి



అలంపూర్‌లో గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు



ధరూరులో గాంధీ చిత్ర పటానికి వినతి అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి స్పందించకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ అన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, నాగేశ్వరమ్మ, అంజలి, మేరీ, మంజుల, కృష్ణవేణి, పద్మావతి, విజయమ్మ, పద్మ, చిట్టెమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

మల్దకల్: ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నర్సమ్మ, కాంతమ్మ, సుజాతలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధరూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మాధవి, భాగ్యమ్మ, సమిత, జ్యోతి పాల్గొన్నారు.

రాజోళి: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె తప్పదని ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కమిటీ సభ్యులు అన్నారు. వారు విలేకరులతో మాట్లాడారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆశా కార్యకర్తలకు కాంగ్రెస్ మండల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, సర్పంచులు నాగేష్ పాల్గొన్నారు.

అయిజ: ఆశ కార్యర్తలు గాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ కార్యర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గాంధీ జయంతి సందర్భంగా ఆశా వర్కర్లు గాంధీ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, కరుణ, వెంకటేశ్వరి, మహాలక్ష్మి పాల్గొన్నారు.



రాజోళిలో..



ఉండవెల్లిలో..

మహాత్ముడి ఆశయాలను కొనసాగిద్దాం

- మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: సత్యం, అహింస అనే ఆయుధాలతో దేశ స్వాతంత్ర్య కోసం నిరంతరం శ్రమించి జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను కొనసాగించాలని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. ఇటిక్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆశా వర్కర్లు మాజీ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జోగుల రవి, రుక్మాందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేష్, రామచంద్రారెడ్డి, శాంతన్న, జైపాల్‌రెడ్డి, బాస్కర్, శేఖర్, ఆశా వర్కర్లు ఉన్నారు.

మహనీయుల జయంతి

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎర్రవల్లి కూడలిలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మీడియా హక్కులను పరిరక్షించాలి



గద్వాల రూరల్: మీడియా హక్కులను పరిరక్షించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు శ్యామ్, జర్నలిస్టులు సీరాజుద్దీన్, హరికృష్ణ, వెంకటేష్, శ్రీనివాసులు, ఇబ్రహీం, ఇలియాస్ ఉన్నారు.

కారు బోల్తా : మహిళకు గాయాలు

ఉండవెల్లి: హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న కారు బోల్తా పడి మహిళకు గాయాలైన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ అరుణ తెలిపిన కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు కారులో భార్యాభర్తలు దామోదర్‌గుప్తా, శ్రీవాణి, కుమారుడు తనయ్‌దీప్ కలిసి వెళ్తున్నారు. పుల్లూరు శివారులో జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో శ్రీవాణికి ఎడమ చెయ్యి విరిగింది. వెంటనే ఆమెను 108లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు.



జాతీయ రహదారిపై బోల్తా పడిన కారు



ఉండవెల్లిలో నీరుపోసి నాటుతున్న రైతులు

మొక్క మొక్కకూ నీరు..

మండల కేంద్రంలోని రైతులు వర్షం రాకపోవడంతో పొగాకు పంటకు నేల తడి శాతం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నేలలో నీటి శాతం తక్కువ కావడంతో నీరు బిందెలతో తెచ్చు కుని జగ్గులతో నీరు పోసి నాటుతున్నారు. వాటిని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– ఉండవెల్లి

లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదన్న, భీమసేనరావ్, భగత్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

దళిత వాడల్లో డీకే అరుణ సందర్శన

ధరూరు: దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వరకు నిర్వహిస్తున్న సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండల కేంద్రంలోని దళిత వాడల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, రాంచంద్రారెడ్డి, రామిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కిష్టన్న, రాములు, లక్ష్మన్న, హనిమిరెడ్డి, వేమారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న డీకే అరుణ

రైతుభరోసా సభను విజయవంతం చేయండి



రైతులతో మాట్లాడుతున్న కేశవరావు

మానవపాడు: రైతు భరోసా సభ ఏర్పాట్లను సోమవారం బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఎంసీ కేశవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుభరోసా సభ ఈ నెల 18వ తేదీన మానవపాడు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

అలంపూర్: వరద బాధితులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని వరద బాధితులకు కేటాయించిన ప్లాట్లను బీఎస్పీ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షపడ్డ ఖైదీకి విముక్తి ఉంది కానీ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల కష్టాలకు విముక్తి కలిగించడం లేదన్నారు. 2009లో వరదల్లో నష్టపోయిన బాధితులను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రోజు బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వరద బాధితుల కోసం 43 ఎకరాలు సేకరించినప్పటికి 15 ఏళ్లుగా పంపిణీ చేయడం లేదన్నారు. ప్రజలను ఓటర్లుగానే చూస్తున్నారే తప్ప అభివృద్ధి చేద్దామనే సోయిలేదన్నారు. కార్యక్రమంలో కనకం బాబు, సుంకన్న, సురేష్, ప్రకాశం, నరసింహ, చంద్రన్న ఉన్నారు.



మాట్లాడుతున్న మహేశ్

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం



అలంపూర్‌లో మాట్లాడుతున్న రాజు



తూర్పుగార్లపాడులో..

అలంపూర్: సామాజిక పోరాటాలతో కేవీపీఎస్ విజయాలు సాధించిందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్‌లో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కేవీపీఎస్ జెండాను మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఆవిష్కరించారు. కేవీపీఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిందన్నారు. గడిచిన కాలంలో ఎన్నో సామాజిక పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు.కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నాగరాజు, సభ్యులు అయ్యప్ప, గంగన్న, నాయకులు వెంకట్రామయ్య శెట్టి, యూటీఎఫ్ నాయకులు రమేష్, మద్దిలేటి, మాజీ సర్పంచ్ జయరాముడు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆశన్న పాల్గొన్నారు.

రాజోళి: కేవీపీఎస్ ఆవిర్భవించాక గ్రామాల్లో కుల వివక్షలు దూరమయ్యాయని కేవీపీఎస్ నాయకులు విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని తూర్పుగార్లపాడులో కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద కేవీపీఎస్ జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు మారెన్న ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కేవీపీఎస్ నాయకులు సవారన్న, వెంకటన్న, కర్రెప్ప, గట్టన్న ఉన్నారు.

తవ్వుకునోడికి.. తవ్వుకున్నంత!



వీరాపురం శివారులో పెద్దగట్టుపై మట్టి తవ్వకాలు

- వీరాపురం శివారులో అడ్డగోలుగా మట్టి తవ్వకాలు
- లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

గద్వాల అర్బన్: అనుమతుల్లేవ్.. అడిగేటోళ్లు లేరు. ఇంకేముంది అక్రమార్కులు మట్టిని తవ్వేస్తున్నారు. గద్వాల మండలంలోని వీరాపురం గ్రామ శివారులో మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. కొందరు కాసుల కక్కుర్తిపడి అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో 'తవ్వుకున్నోడికి.. తవ్వుకున్నంత' అన్న చందంగా మారింది. మట్టి మాఫియా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రాత్రినక, పగలనక మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున్న తవ్వకాలు చేపట్టి దర్జాగా తరలిస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పదుల సంఖ్యలో తరలింపు..

కొంత కాలంగా వీరాపురం శివారుల్లో పెద్ద గుట్టను కొల్లగొడుతున్నారు. వీరికి నిబంధనలతో పని లేదు. అనుమతులు అంతకన్నా అవసరం లేదు. జేసీబీ, ట్రాక్టర్లతో గుట్టను తవ్వేస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు జిల్లా కేంద్రంలోని గృహ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, షాపింగ్ కాంప్లెక్స్ తదితర వాటికి తరలిస్తున్నారు. ఒక్కోట్రాక్టర్‌కు రూ.1000నుంచి రూ.1300 ల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా నిత్యం మట్టి తరలింపుతో పెద్దగట్టు రూపురేఖలు లేకుండా పోయింది. ట్రాక్టర్లు మట్టి లోడ్‌లతో పదేపదే తిరుగుతుండడంతో చుట్టుపక్కల రైతులతో పాటు అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

వాస్తవానికి మట్టి తవ్వకాలు చేపట్టలంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోని ప్రభుత్వానికి డీడీ రూపంలో డబ్బులు చెల్లించాలి. కొందరు అక్రమార్కులు ఇవేమీ లేకుండానే రెవెన్యూ, మైనింగ్ శాఖల్లోని కొందరు అధికారులను మచ్చిక చేసుకోని మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు బహటంగానే వినిపిస్తున్నాయి. విలువైన ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా.. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున్న తవ్వకాలు చేపట్టి దర్జాగా ఆయా శాఖల కార్యాలయాల ముందు నుంచే మట్టిని తరలించడం గమనార్హం. ఇప్పటి వరకు ఆయా శాఖల అధికారులు మట్టి మాఫియాపై చర్యలు తీసుకున్న దాఖలు లేవు. అక్రమార్కులు కొందరు అధికారులకు మూముళ్లు ముట్టజెబుతున్నారనే ఆరోపణలు మూటగట్టుకున్నాయి. ఇక మట్టి తరలింపుపై స్థానికులు అధికారులకు సమాచారం అందిస్తే 'చర్యలు తీసుకుంటామని చెబుతారే తప్పా ఆ దిశగా మాత్రం అడుగులు వేయడం లేదు. కొంతకాలంగా పెద్ద ఎత్తున్న వీరాపురం శివారులో ఈ తవ్వకాలు చేపడుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని అక్రమ మట్టిని తరలింపును అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు..



మట్టి తవ్వకాలకు రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ శాఖ ద్వారా వీరాపురం శివారులో తవ్వకాలకు మేము ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అక్కడ మా సిబ్బందికి పంపించి విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. నేను ఇటీవల మా సిబ్బంది మాముళ్లు తీసుకుంటున్నారనేది నా దృష్టికి రాలేదు. విచారణ చేపడుతాం.

– నరేందర్, తహసీల్దార్, గద్వాల